క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డికి సత్కారం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సత్కరిస్తున్న అజయ్‌కుమార్

తిరుపతి మంగళం : రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షులు అజయ్‌కుమార్ శనివారం మారుతీనగర్‌లోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. తనకు పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి జగనన్నను సీఎం చేసుకునేందుకు తమ వంతు కృషి చేస్తానన్నారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్టమెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 61,425 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 26,430 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.01 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లోనే దర్శనం చేసుకుంటున్నారు.

వకుళమాత సేవలో నటకిరీటి



తిరుపతి రూరల్: తిరుపతి సమీపంలోని పేరూరు కొండపై కొలువై ఉన్న వకుళమాత ఆలయాన్ని సినీనటుడు రాజేంద్రప్రసాద్ శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ముందున్న వందల్ల ఏళ్లనాటి ఆలయానికి సంబంధించిన శాసనాన్ని ఆసక్తిగా పరిశీలించారు. ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలను అందించారు. అంతకుముందు ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ ఆస్పత్రి పనివేళల్లో మార్పు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని ఆర్టీసీ ఉద్యోగుల ఆస్పత్రిలో వేసవి నేపథ్యంలో శనివారం నుంచి పని వేళల్లో మార్పులు చేశారు. గతంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గతంలో ఆస్పత్రి అందుబాటులో ఉండేది. ఈ క్రమంలో మార్చిన ప్రకారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే ఆస్పత్రి పనిచేస్తుంది. ఈ విషయాన్ని ఆర్టీసీ ఉద్యోగులు గుర్తించి వైద్య సేవలు పొందాలని అధికారులు తెలిపారు.

మనస్సాక్షితో పనిచేయండి

తిరుపతి క్రైమ్: ఎన్నో బాధలతో కోర్టుకు ఎంతో మంది బాధితులు వస్తుంటారని, వారికి మనం మనస్సాక్షితో పని చేయాలని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి కోర్టు కానిస్టేబుల్‌కు దిశానిర్దేశం చేశారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన కోర్టు పోలీస్ కానిస్టేబుళ్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు మానిటరింగ్ సిస్టం ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా విజయవాడలో మొదటి సారి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా కేసులు పురోగతిని పరిశీలించవచ్చని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పాకాల : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధికారులు అందుబాటులో ఉంటారని తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఆమె శనివారం దామలచెరువు పంచాయతీ బందార్లపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను అధికారులకు తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామంలో సుమారు 22 అర్జీలు అందాయన్నారు.


కేంద్రమంత్రికి ఘన స్వాగతం



కేంద్రమంత్రికి స్వాగతం పలుకుతున్న వీసీ కృష్ణమూర్తి, బీజేపీ నాయకులు

తిరుపతి గాంధీ రోడ్ : నగరంలోని విద్యాపీఠం అతిథి గృహానికి విచ్చేసిన కేంద్ర మంత్రి విశ్వేశ్వర్ తుడుకు విద్యాపీఠం వీసీ కృష్ణమూర్తి శనివారం ఘన స్వాగతం పలికారు. ఆయనను బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, అక్కినపల్లి మునికిష్ణ యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్, కవిత ఘనంగా సత్కరించారు.

మురళీ నాయక్‌కు డాక్టరేట్



తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీయూ కెమికల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి మూడే మురళీ నాయక్ డాక్టరేట్ పొందారు. ఆయన అసోసియేట్ ప్రొఫెసర్ పి.అఖిల స్వతంత్ర పర్యవేక్షణలో సెపరేషన్ ఆఫ్ హెవీ మెటల్స్ ఫ్రమ్ ఇండస్ట్రియల్ ఎఫ్లూయెంట్స్ అనే అంశంపై పరిశోధన చేశారు.

తిరుమలలో వర్షం..

పులకించిన భక్త జనం

తిరుమలలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. దుకాణాలను మూసేశారు. భక్తులు షెల్టర్లలో తల దాచుకున్నారు. కొందరు వర్షంలోనే తడుస్తూ ముందుకు సాగారు. శ్రీవారి ఆలయ ప్రాంగణంతోపాటు మాఢ వీధులు నిర్మానుష్యంగా మారాయి. రాంబగీచా వద్ద నీటిలో బ్యాటరీ కారు ఆగిపోయింది. ఎండ వేడిమితోపాటు ఉక్కపోతతో అల్లాడిన భక్తులు వర్షంతో ఉపశమనం పొందారు. - తిరుమల





ఆలయం వెలుపల వర్షంలో షెడ్ల కింద వేచి ఉన్న భక్తులు



వర్షానికి చిన్నారులపై టవల్ కప్పి తీసుకెళ్తున్న భక్తులు







వర్షం కారణంగా నిర్మానుష్యంగా మారిన మాడ వీధి, వర్షపు నీటిలోనే వెళుతున్న వాహనదారులు, కార్లు

ఆలయ విమాన గోపుర పనులకు పూజ



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, కట్టా గోపియాదవ్

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ గర్భాలయ విమాన గోపురం పనులకు శనివారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ మే మొదటి వారంలో అమ్మవారి ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లను ప్రారంభించాలని ఆదేశించినట్లు చెప్పారు. మేయర్ శిరీష, ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్, ధనశేఖర్, భారతి, గీత, రమణమ్మ పాల్గొన్నారు.

మే 1 నుంచి మహాకుంభాభిషేకం

తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవం మే 1 నుంచి 5వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్ తెలిపారు. ఆలయ ఆవరణలో శనివారం పాలక మండలి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది మహాకుంభాభిషేకంతో పాటు గంగజాతరను ఘనంగా నిర్వహిస్తామన్నారు. వీఐపీలు, దాతలకు అమ్మవారి పేరు మీద ఉన్న కండువాలు, గంగమ్మ ఫొటో అందజేస్తామన్నారు. జాతరకు వీఐపీ పాసులను రద్దు చేయాలని తీర్మానం చేసినట్లు వివరించారు. గంగమ్మ ఆలయ పునర్నిర్మాణం పనులకు సుమారు 8 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ లోటును భర్తీ చేసేందుకు రూ.300 టికెట్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. గంగమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భక్తులను భాగస్వాములను చేయడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

వికలాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి జీవకోన, చెన్నారెడ్డికాలనీకి చెందిన ముగ్గురు వికలాంగులకు శనివారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వికలాంగుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. సీఎం ఆశయాలకు అనుగుణంగా తిరుపతి పరిధిలోని వికలాంగులకు ట్రై సైకిళ్ల అందజేసినట్లు పేర్కొన్నారు. గతంలోనూ అనేక మంది వికలాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సేవాదళ్ రీజనల్ ఇన్‌చార్జ్ తలారి రాజేంద్ర, నాయకులు సురేంద్రరెడ్డి, వెంకటమునిరెడ్డి, తిమ్మారెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే మహిళలకు రాజ్యాధికారం





మహిళలను సత్కరిస్తున్న మంత్రి రోజా, డీఈవో శేఖర్ తదితరులు

తిరుపతి కల్చరల్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మహిళలకు పెద్ద పీట వేస్తూ రాజ్యాధికారం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని మంత్రి ఆర్‌కే.రోజా తెలిపారు. లయన్స్ క్లబ్ రాష్ట్ర టీచర్స్ యూనియన్ విభాగం ఆధ్వర్యంలో శనివారం రాత్రి మంగళం రోడ్డులోని ఒక హోటల్లో జాతీయ మహిళా దినోత్సవం నిర్వ హించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఏపీ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ఉందని తెలి పారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న 27 మంది మహిళలకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. డీఈవో శేఖర్, ఎంఈవోలు ప్రభాకర్‌రాజు, మంజుభారతి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మునిశేఖర్, భాస్కర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

6 నుంచి భైరవ సహిత లక్ష్మీ కుబేర మహాయాగం

తిరుపతి కల్చరల్: తిరుపతి సమీపంలోని రాయల చెరువు వద్దనున్న శ్రీశక్తి పీఠంలో 6వ తేదీ నుంచి 9 వరకు శ్రీస్వర్ణాకర్షణ భైరవ సహిత లక్ష్మీ కుబేర మహాయాగం నిర్వహించనున్నటుట శ్రీశక్తి పీఠం మేనేజింగ్ కార్యదర్శి పి.శ్రీకాంత్ తెలిపారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. భారతదేశంలో మొట్ట మొదటి సారిగా 108 హోమ కుండలాలతో జరుగనున్న శ్రీస్వర్ణాకర్షణ భైరవ సహిత లక్ష్మీ కుబేర మహాయాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీస్వర్ణాకర్షణ భైరవుని అనుగ్రహంతో మాత్రమే లక్ష్మీదేవి, కుబేరుడు అనంతమైన సిరి సంపదలను పొందారని పేర్కొన్నారు. మాతాజీ శ్రీరమ్యానంద భారతీ స్వామి ఆధ్వర్యంలో ఈ మహా యాగం చేపడుతున్నట్లు తెలిపారు. దీని ద్వారా ఆర్థిక ఇబ్బందులు, ధనలేమి, రుణబాధలు తొలగి ధనసిద్ధి, స్వర్ణ ప్రాప్తి, ఐశ్వర్య అభివృద్ధి సిద్ధిస్తాయని తెలిపారు. వివరాలకు 9063701687, 7737928773లో సంప్రదించాలని తెలియజేశారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులతో ఎంపీపీ మోహిత్‌రెడ్డి, డీఈవో శేఖర్, సర్పంచ్ రామచంద్రారెడ్డి తదితరులు

- విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు
- ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం సర్పంచ్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన తిరుచానూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. వంద పాఠశాలల్లో చదువుతున్న 2,500 మంది విద్యార్థులను పరీక్ష కిట్లు అందజేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని, అప్పుడే విజయం సాధించవచ్చని వివరించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు పబ్లిక్ పరీక్షల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమంగా నిలిచిన వారికి ల్యాప్‌టాప్‌లు, మండల స్థాయి వారికి ట్యాబ్ లు అందజేస్తామని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. డీఈవో శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. వైస్ ఎంపీపీ యశోద, ఎంపీటీసీ నరేష్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకుడు బొందు సుబ్రమణ్యం రెడ్డి, సాయినగర్, ముండ్లపూడి సర్పంచులు రమణ, సురేష్ రెడ్డి, హెచ్‌ఎం మురళి పాల్గొన్నారు.

వైభవంగా కోదండ రాముడి పట్టాభిషేకం



కోదండరాముడికి పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు



శివజ్యోతినగర్‌లో సీతారాముల ఊరేగింపు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీరామపట్టాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊంజల్ మండపానికి వేంచేపు చేశారు. నరసింహ తీర్థం నుంచి తెచ్చిన తీర్థంతో అభిషేకం చేశారు. రాత్రి 7 గంటల నుంచి శ్రీరామపట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీసీతారామలక్ష్మణులు,బంగారు తిరుచ్చిపైన, ఆంజనేయకస్వామి ప్రత్యేక తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

సీతారాముల ఊరేగింపు

తిరుపతి మంగళం: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి తిరుపతి శివజ్యోతి నగర్‌లో సీతారాములను ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు రమేష్, హేమంత్, సుబ్రమణ్యం రాజు, శ్రీధర్, లోకనాథం, విజయ్, పాల్గొన్నారు.

కంటి సంరక్షణ ముఖ్యం



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి రూరల్ : వేసవి నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కంటి సంరక్షణపై శ్రద్ధ చూపాలని సీగొల్లపల్లి సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వాసన్ ఐ కేర్ ఆస్పత్రి వైద్య బృందం కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందజేశారు. వాసన్ ఐ కేర్ ఆస్పత్రి అధికారి మస్తాన్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చంద్రగిరి: స్థానిక కొత్తపేటలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. తిరుపతిలోని కార్తీక కంటి ఆస్పత్రి వైద్యులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

పన్నుల వసూలులో ముందంజ



మొండి బకాయిదారుల భవనం ముందు రెవెన్యూ సిబ్బంది

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పన్నుల వసూళ్లలో ముందంజలో ఉంది. రెవెన్యూ అధికారులు మార్చి 31 నాటికి 95.97 శాతం మేర పన్నులు వసూలు చేశారు. కార్పొరేషన్ పరిధిలో 68,913 అసెస్మెంట్లకు రూ.65,92,72,936 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉంది. 2022- 23 ఆర్థిక సంవత్సరంలో రూ.63,26,74,448 కోట్లు వసూలు చేశారు. రూ.2,65,98,488 కోట్ల మొండిబకాయలు ఉన్నాయి. రోజువారి టార్గెట్ విధించుకుని పన్ను వసూళ్లపై దృష్టి సారించినట్లు రెవెన్యూ ఆఫీసర్లు కేఎల్ వర్మ, సేతు మాధవ్ తెలిపారు. సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పన్ను వసూలు చేస్తున్నట్లు చెప్పారు. పన్ను వసూళ్లపై కమిషనర్ అనుపమ అంజలి హర్షం వ్యక్తం చేశారు. మరింత సమన్వయంతో పనిచేసి వంద శాతం వసూలు చేయాలని సూచించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శనివారం ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సిద్ధారెడ్డి, సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ నీరజ్ కుమార్ గుప్తా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలు, శ్రీవారి చిత్ర పటాలతో సత్కరించారు.

దుకాణాల అద్దె వసూలులో రికార్డు



ఉద్యోగులను సన్మానిస్తున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : తిరుపతి బస్టాండ్‌లోని దుకాణాల నుంచి రికార్డు స్థాయిలో 99.27 శాతం అద్దె వసూలు చేసినట్టు అధికారులు తెలిపారు. బస్టాండ్‌లో 151 దుకాణాలున్నాయి. ఏప్రిల్ 1 నుంచి మార్చి 31వ తేదీ వరకు రూ.7,08,87,213 వసూలు చేయాల్సి ఉంది. ఈ ఏడాది రూ.7,03,74,218 వసూలు చేశారు. అద్దె వసూలు చేసిన బస్టాండ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఈ.రమేష్ కుమార్, సీనియర్ క్లర్క్ ఎస్.వెంకటరత్నం, జూనియర్ క్లర్క్ కే.మోహన్‌రెడ్డిని జిల్లా ప్రజా రవాణా అధికారి టి.చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం భాస్కర్, ఏటీఎం రామచంద్రనాయుడు సత్కరించారు.

నేడు ఉచిత ఎంసెట్ నమూనా పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి భవానీనగర్ సమీపంలోని శ్రీగగన విద్యా సంస్థలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఎంసెట్ నమూనా పరీక్షను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థ డైరెక్టర్ ఎ.కరుణామూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు పరీక్ష రాయొచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 9014052757లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తిరుపతి ఎడ్యుకేషన్ : పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఓబీజీ విభాగం, ప్రభుత్వ ప్రసూతి, ఎస్వీ వైద్య కళాశాల, తిరుపతి ఐఎంఏ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కౌమార దశలో ఉన్న బాలికల్లో రక్తహీనత, రుతుస్రావ సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది వివరించారు. క్యాన్సర్ సర్విక్స్ టీకాలపై అవగాహన కల్పించారు. రక్తహీనత స్క్రీనింగ్ పరీక్షలు, 16 నుంచి 18 ఏళ్లలోపున్న 180 మందికి హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. రక్తహీనత ఉన్న వారికి చికిత్స అందించారు. కార్యక్రమంలో ఏపీ ఓబీ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ భారతి, కార్యదర్శి డాక్టర్ సునీత, డాక్టర్లు బాలాజీ, జయశ్రీ, పీజీ విద్యార్థినులు, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ క్రీడాకారుడిని ఆదుకోండి



అథ్లెటిక్ క్రీడాకారుడిని సత్కరిస్తున్న బీజేపీ నేతలు

తిరుపతి కల్చరల్: ఈ ఏడాది ఫిబ్రవరిలో దుబాయ్‌లో జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్‌లో సిల్వర్ మెడల్ సాధించి చైనాలో జరుగనున్న ఏషియన్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న తిరుపతికి చెందిన ఉయ్యాల మోహన్‌హర్షకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బీజేపీ ధార్మిక విభాగం జిల్లా కన్వీనర్ అక్కిపల్లి మునిక్రిష్ణయాదవ్, సాంస్కృతిక శాఖ విభాగం జిల్లా కన్వీనర్ గుండాల గోపీనాథ్‌రెడ్డి కోరారు. వారు శనివారం ప్రెస్‌క్లబ్‌లో క్రీడాకారుడిని సత్కరించారు. అతనికి రూ.10 వేలు సాయం చేశారు. వారు మాట్లాడుతూ చిన్నతనంలో విద్యుత్ షాక్‌తో కుడి చేతిని పోగొట్టుకున్నా పట్టుదలతో శ్రమిస్తున్నాడని పేర్కొ న్నారు. క్రీడాకారుడు మోహన్ హర్ష మాట్లాడుతూ తాను ఒలింపిక్ స్థాయికి చేరి అథ్లెటిక్స్‌లో పతకం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత, కోచ్ నాగపూరి రమేష్ వద్ద శిక్షణ పొందుతున్నట్టు తెలిపారు. దాతలు సాయం అందిస్తే అథ్లెటిక్స్‌లో దేశానికి మంచి పేరు తెస్తానని తెలిపారు. సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

18 ఏళ్లలోపు బాలికల కోసం మిషన్ వాత్సల్య

చంద్రగిరి: 18 ఏళ్ల లోపు బాల బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకాన్ని అమలుచేస్తోందని ఐసీడీఎస్ సీడీపీవో ప్రతిభ తెలిపారు. ఈ పథకానికి తల్లి వితంతువు లేదా విడాకులు తీసుకున్న, కుటుంబం నుంచి వెలివేయబడిన వారు, అనాథలై బంధువుల వద్ద ఉంటున్న పిల్లలు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న వారి పిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి చెందిన పిల్లలు అర్హులని తెలిపారు. అలాగే జువైనల్ జస్టిస్ యాక్ట్ 2015 అనుసరించి సంరక్షణ అవసరమైన పిల్లలు, బాల్య వివాహాల బాధితులు, అక్రమ రవాణాకు గురైన పిల్లలు, వికలాంగులు, రూ.72 వేల లోపు వార్షిక ఆదాయం ఉన్న బాధితులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హత పొందిన వారికి నెలకు రూ.4 వేలు స్పాన్సర్‌షిప్ అందజేస్తామని తెలిపారు. అర్హులైన వారు అమ్మ, నాన్న, గార్డియన్ ఆధార్, రేషన్ కార్డ్, బ్యాంక్ ఖాతా మొదటి పేజీ జిరాక్స్, వయస్సు ధ్రువీకరణ పత్రం (స్టడీ, బర్త్ సర్టిఫికెట్, టీసీ), మరణ ధ్రువీకరణ (అనాథలైతే తల్లి లేదా తండ్రి, లేదా భర్త) ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఏఆర్టీ బుక్ మొదటి పేజీ, కోవిడ్ అయితే ఐసీఎంఆర్ పత్రం, రెండు ఫొటోలు జతచేసి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు మీ పరిధిలోని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.